క్లుప్తంగా

గోస్పాడు ఎస్ఐగా సుధాకర్‌రెడ్డి



గోస్పాడు: గోస్పాడు ఎస్ఐగా సుధాకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల పట్టణంలోని టూటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయనను ఉన్నతాధికారులు గోస్పాడుకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ వెంకటప్రసాద్ విజిలెన్స్ ఎస్ఐగా బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పెద్దయమ్మనూరులో తిరునాల ప్రారంభం

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో అంకాలమ్మ, చౌడేశ్వరి దేవి, గంగమ్మ తల్లి తిరునాల సోమవారం ప్రారంభమయింది. ఈ ఉత్సవం ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో మంగళవారం నంద్యాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. తమ శాఖల పరిధిలో జరిగే పనుల వివరాలతో అధికారులు హాజరుకావాలని, ఎవరైనా గైర్హాజరు అయితే చర్యలు తప్పవని సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

300 క్వింటాళ్ల జీలుగల కేటాయింపు

రుద్రవరం: మండలానికి 300 క్వింటాళ్ల జీలుగలు కేటాయించినట్లు వ్యవసాయాధికారిణి సునీత తెలిపారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతుండటంతో రైతులకు ఎకరానికి 10 కేజీల చొప్పున 5 ఎకరాలకు 50కేజీల వరకు జీలుగ విత్తనాలు అందజేస్తామన్నారు. 10 కేజీల ధర రూ.1230 కాగా 50 శాతం రాయితీ పోగా రైతు రూ.515 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించండి

రుద్రవరం: మండల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్‌లైన్ క్లోరినేషన్, క్లోరినేషన్ మాత్రలు వినియోగించే విధానంపై వివరించారు. ఓహెచ్‌ఆర్ఎస్ ట్యాంకుల చుట్టు శుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు. అలాగే మన మిత్ర, క్యాంపెయిన్ సర్వే, వర్క్ ఫ్రం హోమ్, హౌస్ ఓల్డ్ జియోట్యాగింగ్ సర్వే, పిల్లల ఆధార్ నమోద తదితర సక్రమంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పీఆర్‌ఏఈ కమాల్ సాహెబ్, ఏఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


ఎఫ్ఏల నియామకం



ఎఫ్ఏలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

చాగలమర్రి: మండలంలోని వివిధ గ్రామాలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లుగా కొత్తగా ఆరుగురిని నియమించారు. గోడిగనూరు గ్రామానికి బాబు, డి.వనిపెంట గ్రామానికి నరసింహుడు, మల్లెవేముల గ్రామానికి నందిని, చిన్నవంగలి గ్రామానికి నర్సిరెడ్డి, చిన్నబోధనం గ్రామానికి ఇథీశ్వరరెడ్డి, చింతలచెరువు గ్రామానికి గోవిందరెడ్డిని నియమిస్తూ సోమవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ నియామక పత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను తొలగించింది. ఆస్థానాల్లో అధికారపార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుంటున్నారు. ఇప్పుడు కొత్తగా జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం కూడా అలాగే జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మల్లన్నకు నృత్యార్చన



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై నందికొట్కూరుకు చెందిన సిద్ధేంద్ర నర్తన కూచిపూడి అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, శ్రీశైలవాసా, అయిగిరినందిని, నమో నమో నటరాజ, శివ తాండవం, శంభో శివ శంభో తదితర గీతాలకు అర్చన, రామతులసి, శశికమల, వెంకటపూజిత తదితరులు నృత్యం చేశారు.

కల్యాణ వైభోగమే

- చాగలమర్రి, రుద్రవరంలో వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చాగలమర్రి: శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం చాగలమర్రి మండలం మూడురాళ్లపల్లె గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. శ్రావణ నక్షత్రం సందర్భంగా ఉభయదారులు రేపాకుల శ్రీనివాసులు, రజిత, రేపాకుల నాగేంద్రప్రసాద్, నాగజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ప్రముఖ అర్చకులు కైప వెంకటేశ్వర శాస్త్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత గణపతిపూజ, పుణ్యహవాచనం, కంకణ ధారణ, పట్టు వస్త్రాల సమర్పించి స్వామి,అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఊరేగించారు. ఈ వేడుకను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఉభయదారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాత రిటైర్డ్ బిల్ కలెక్టర్ సుబ్బారాయుడు, పులి చిన్న ఓబుల్‌రెడ్డి, పులి ఓబుల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మూడురాళ్లపల్లెలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు మాంగళ్యధారణ గావిస్తున్న ఉభయదారులు, రుద్రవరంలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ముగిసిన వాసాపురం వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె దారిలో వెలసిన లక్ష్మి, గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఘనంగా సాగింది. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఈ వేడుకను తిలకించి పరవశించారు. ముందుగా ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మి, గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని నూతనంగా నిర్మించిన బాలాలయంలో ప్రతిష్ఠించారు. తర్వాత స్వామి,అమ్మవార కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ మహోత్సవం సందర్భంగా ఆలయ నిర్వాహకులు నంద్యాల బాలభవన్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



రుద్రవరం..భరతనాట్యం ప్రదర్శిస్తున్న నంద్యాల విద్యార్థులు



వాసాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మూడురాళ్లపల్లెలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

ఉయ్యాలవాడ: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరావు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. తర్వాత తహసీల్దార్ మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ సర్టిఫికెట్లు పెండింగ్ లేకుండా పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గత నాలుగు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి, మట్టి మిద్దెల్లో నివాసం ఉంటున్న గృహ యజమానులను అప్రమత్తం చేయాలని వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటయ్య, ఫణీత్‌క్రిష్ణ, ఏపీఓ హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

మాన్యం కౌలుకు వేలం

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామంలో వెలిసిన శ్రీ వినాయక, జనార్దన, రామలింగేశ్వర స్వామి ఆలయాలకు చెందిన 90.96 ఎకరాల మాన్యం భూములు ఒక్క సంవత్సరం కౌలుకు సోమవారం వేలం పాట నిర్వహించారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొని రూ. 17.66 లక్షలకు వేలం పాట ద్వారా భూములు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే కౌలు ద్వారా రూ. 86 వేలు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆలయ ధర్మకర్త అంబటి నారాయణరెడ్డి, గ్రామ పెద్దలు గండా వెంకటరామసుబ్బారెడ్డి, వెంకటశివారెడ్డి, ఎర్రి వెంకటస్వామిరెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరివరంలో వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం ఇవ్వాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్ కో యాజమాన్యం హైకోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా సోలార్ పరిశ్రమ కోసం గిరిజనుల భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుందన్నారు. గడివేముల మండలం ఎల్‌కే తండా గ్రామంలోని 1972లో గిరిజన రైతులకు సర్వే నెం.795, 797, 802లో చనకపల్లి పొలిమేరలో ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందన్నారు. వన్‌బీ అడంగల్, పాసు పుస్తకాలు రైతుల పేరు మీదే ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ భూములను గ్రీన్‌కో ప్రాజెక్టు యాజమాన్యం ఎలాంటి పరిహారం ఇవ్వకుండా సోలార్ కోసం తీసుకుంటుందన్నారు. దీనిపై స్పందించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు సామేనాయక్, బద్దూనాయక్, స్వామినాయక్, జీవుల నాయక్, అమీబాయి, లక్ష్మీబాయి, వెంకటరాముడు, సుగాలి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

చదువుతో పాటు సంస్కారం ముఖ్యం

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు బాల్య దశ నుంచే చదువుతో పాటు సంస్కారం అలవర్చుకోవాలని మిల్లెట్స్ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇటీవల పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచిత పుస్తకాలను మన ఊరు-మన గుడి, మన బాధ్యత సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. మన ఊరు, మనగుడి, మన బాధ్యత గౌరవాధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాల్య దశ నుంచే నీతి శతకాలు, పురాణ గాథలు, విద్యార్థులు చదవటం వల్ల సన్మార్గంలో రాణించవచ్చన్నారు. అనంతరం కులమతాలకు అతీతంగా 200 మంది పదవ తరగతి పాస్ అయిన విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీకమ్మ, హరికృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మిల్లెట్స్ రామసుబ్బారెడ్డి

సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలి

నంద్యాల(న్యూటౌన్): పుచ్చలపల్లి సుందరయ్య కలలు కన్న సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు పాటు పడాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు తోటమద్దులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పుల్లా నరసింహులు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధికి పాటు పడిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. సంపూర్ణ స్వాతంత్య్రం కావాలని నినాదాన్ని ఇచ్చిన వ్యక్తి అన్నారు. పేద ప్రజల పక్షాన ఎన్నో పోరాటాలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, లక్ష్మణ్, మౌలాలి, భాస్కరాచారి, జైలాన్, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం తదితరులు పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పల్లకీలో విహరించిన మహానందీశుడు

మహానంది: శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించారు. పల్లకీ సేవకు ముందు గోమాతలను అలంకరించి ముందు నడిపించారు. శాస్త్రోక్త పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీని ఊరేగించారు.



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

తట్టు,రూబెల్లా నివారణకు టీకానే మార్గం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: తట్టు, రూబెల్లా వ్యాధి నివారణకు టీకా తీసుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేషనల్ జీరో మీజిల్స్–రుబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ కార్యక్రమం (2025–26)లో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 9 నెలల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఎంఆర్–1, 2 వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తట్టు, రూబెల్లా వ్యాధిని రూపుమాపేందుకు గాను నేషనల్ జీరో మీజిల్స్–రుబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ చేపట్టినట్లు వెల్లడించారు. 0–5 ఏళ్ల పిల్లలకు తప్పనిసరిగా 3 టీకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 0–5 ఏళ్ల పిల్లలు 2,34,282 మంది ఉన్నారన్నారు. వీరందరికీ మూడు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఇందుకు మొదటి విడత మే 26 నుంచి 31 మే వరకు, రెండో విడత జూన్ 23 నుంచి 28 వరకు, మూడవ రౌండు జూలై 21 నుంచి 26వ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2026వ సంవత్సరం లోపు తట్టు, రూబెల్లా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సహకరించి మూడు విడతలుగా జరిగే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నిబంధనల ప్రకారం సాధారణ బదిలీలు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నిబంధనలను అనుసరించి ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సాధారణ బదిలీలు, స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర తదితర కార్యక్రమాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిందన్నారు. జూన్ మాసంలో నీరు–మీరు అనే థీమ్‌తో పల్లె పుష్కరిణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న ట్యాంకులను అభివృద్ధి చేయడానికి డ్వామా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

పొదుపు సంఘాల ఉత్పత్తులు కొనుగోలు చేయండి

స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మైస్టోర్ యాప్‌లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ఓపెన్ చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైస్టోర్ యాప్‌లో ఇప్పటి వరకు 1200 ఉత్పత్తులు ఉన్నాయన్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

మహానంది: క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్టవిధ మహామంగళ హారతులు నిర్వహించారు.



చిన్న కోనేరులో భక్తుల స్నానాలు

పదవులకే వన్నె తెచ్చిన గొప్ప నేత నీలం సంజీవరెడ్డి



సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా ఆ పదవులకే వన్నెతెచ్చిన మహానాయకుడు స్వర్గీయ 'నీలం సంజీవరెడ్డి' అని నంది రైతు సమాఖ్య గౌరవ సలహాదారులు, విశ్రాంత శాస్త్రవేత్త ఖాదరబాద్ రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం 'నీలం సంజీవరెడ్డి జయంతి కార్యక్రమం నంది రైతు సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ నీతికి నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచి రైతు నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన సంజీవరెడ్డి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించారన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, శ్రీశైలం విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటులో సంజీవరెడ్డి కృషి రైతులు, ప్రజలు ఎప్పటికీ మరవరన్నారు. అధ్యాపకులు రఫీ, కవి నీలకంఠమాచారి.. నీలం సంజీవరెడ్డి జీవిత విశేషాలపై కవితలు వినిపించారు. కార్యక్రమంలో డాక్టర్ సహదేవుడు, నీలం వెంకటేశ్వర్లు, చంద్రశేఖరరెడ్డి, ఓబుళపతి, శేషఫణి, అన్నెం శ్రీనివాసరెడ్డి, నంది రైతు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆశలు వర్షార్పణం

అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. చేతికి వచ్చిన పంటలు తడిసిముద్దవుతున్నాయి. మండలంలో రబీ సీజన్ కింద వరి, మొక్కజొన్న, మినుము తదితర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం ఈపంటలు కోత దశకు వచ్చాయి. కోటకొండ, ఎల్లావత్తుల, డి.కొట్టాల, పెద్దకంబలూరు, రుద్రవరం, రెడ్డిపల్లె, తిప్పారెడ్డిపల్లె తదితర గ్రామాల పరిధిలో కోతలు సాగిస్తూ దిగుబడులను ఆరబెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో గత మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. చాలా గ్రామాల్లో మినుము పంటను యంత్రాలతో కోయించి నూర్పిడి చేసేందుకు కుప్పలు పోశారు. వానకు ఈ కుప్పలు తడిసిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు పంటను కాపాడుకునేందుకు పట్టలు కప్పుతున్నారు. వర్షం ఆగకపోతే తాము పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని బాధిత రైతులు వాపోతున్నారు.

– రుద్రవరం



అకాల వర్షాలతో రెడ్డిపల్లె సమీపంలో సగంలోనే నిలిపేసిన మినుము పంట కోత



తువ్వపల్లె సమీపంలో మినుము తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ అటానమస్ కళాశాల 2022–25 అకాడమిక్ డిగ్రీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. కళాశాల అధినేత రామకృష్ణారెడ్డి, అకాడమిక్ అబ్జర్వర్ డాక్టర్ ఎన్‌టీకే నాయక్ ఈ ఫలితాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రథమ శ్రేణిలో 69 మంది పాసు కావడంతో రామకృష్ణ డిగ్రీ కాలేజీ 85.85శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, కుమార్, వెంకటరావు, సంపత్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.